నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 21-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 17 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు .. ఇద్దరు ఐటీబీపీ జవాన్లు మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్‌కు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో ఇద్దరు ఇండో టిబెటన్ బార్డర్ పోలీసులు (ఐటీబీపీ) మృతి చెందారు. చోటెడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాదేమెట ప్రాంతంలోని ఐటీబీపీ శిబిరానికి సమీపంలో ఈ మధ్యాహ్నం కాల్పులు చోటు చేసుకున్నాయి. 45వ బెటాలియన్‌కు చెందిన ఐటీబీపీ జవాన్లు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా నక్సల్స్ తారసపడటంతో ఎదురు కాల్పులు జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందరరాజ్ తెలిపారు. నక్సల్స్ కాల్పుల్లో ఐటీబీపీ అసిస్టెంట్ కమాండర్ సుధాకర్ షిండే, ఏఎస్ఐ గురుముఖ్ సింగ్ మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలం నుంచి ఓ ఏకే-47 రైఫిల్, రెండు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, ఓ వైర్‌లెస్ సెట్‌ను నక్సల్స్ అపహరించినట్లు వెల్లడించారు. నక్సల్స్ కోసం భద్రతా దళాలు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి.

అధ్యాత్మిక పర్యాటకం బలోపేతం కావాలి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 20: దేశంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని, తమ సర్కారు అదేపని చేస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ (ఖఓ ఓనీటతి) అన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం బలోపేతం కావడంవల్ల యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. అంతేగాక యువతకు మన దేశ గత సంస్కృతి గురించి తెలుస్తుందన్నారు. భయాలు విశ్వాసాన్ని దెబ్బతీయలేవని, మనం గతం నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉన్నదని ప్రధాని పేర్కొన్నారు.

ఇవాళ ప్రధాని మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లోని సోమ్‌నాథ్ పట్టణంలో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమ్‌నాథ్ ప్రోమనేడ్, సోమ్‌నాథ్ ఎగ్జిబిషన్ సెంటర్, పార్వతీ టెంపుల్, ఓల్డ్ సోమనాథ్ టెంపుల్ ప్రహరీ పునర్నిర్మాణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన భారతదేశ పురాతన చరిత్ర గొప్పతనాన్ని గురించి ప్రస్తావించారు.

'వాటర్ ప్లస్' నగరంగా హైదరాబాద్.. కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ , ఆగష్టు 20: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్వచ్ఛ భారత్ మిషన్ కింద హైదరాబాద్ నగరం వాటర్ ప్లస్ (చిజీబివతీ జూశ్రీబీబ) హోదా పొందింది. ఈ మేరకు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేస్తూ నగర ప్రజలకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నగరం ఇప్పటికే రాఆఈ++ సిటీగా గుర్తింపు పొందింది. ఈ నగరాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు కృషి చేస్తామని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ 2021లో భాగంగా ఇండోర్ నగరం దేశంలోనే తొలి వాటర్ ప్లస్ నగరంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. స్వచ్ఛ సర్వేక్షన్ అనేది నగరాలు మరియు పట్టణాలలో పరిశుభ్రత, పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యం యొక్క వార్షిక సర్వే. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వాటర్ ప్లస్ హోదా రావాలంటే.. నదులు, కాలువలలో పరిశుభ్రతను నిర్వహించాలి. గృహాలు, వాణిజ్య సముదాయాల నుంచి విడుదలయ్యే మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే పర్యావరణంలోకి విడుదల చేయాలి. అలా చేస్తున్న నగరాలకు వాటర్ ప్లస్ హోదా లభిస్తోంది.

3 నెలల్లోనే నా కల నిజమైంది.. సీఎం కేసీఆర్‌కు థ్యాంక్స్ చెప్పిన సీజే ఎన్వీ రమణ

హైదరాబాద్ , ఆగష్టు 20: అంతర్జాతీయ వాణిజ్య వివాదాల మధ్యవర్తుల కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఇవాళ ప్రారంభించారు. ఆ సెంటర్‌కు చెందిన ట్రస్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ (అఏఏ ఔ ఖీజీఏజీనిజీ) మాట్లాడారు. తెలంగాణ చరిత్రలోనూ, హైదరాబాద్ చరిత్ర లోనూ ఈ రోజు గొప్పదినంగా నిలిచిపోతుందన్నారు. 3 నెలల సమయంలోనే తన కల నిజమవుతుందని ఎన్నడూ ఊహించలేదని సీజే తెలిపారు. తన కల నిజమయ్యేలా చేసిన తెలంగాణ సీఎం కేసీఆర్, సీజే హిమా కోహ్లీకి ఆయన థ్యాంక్స్ తెలిపారు.

జూన్‌లో హైదరాబాద్‌కు వచ్చానని, ఆ సమయంలో ఆర్బిట్రేషన్ సెంటర్ గురించి చీఫ్ జస్టిస్‌తో మాట్లాడినట్లు ఆయన గుర్తు చేశారు. ఆర్బిట్రేషన్ కేంద్రం ఏర్పాటుతో అంతర్జాతీయ సమస్యలను త్వరగా పరిష్కరించువచ్చు అని సీజే అన్నారు. పెట్టుబడిదారులు తమ లిటిగేషన్‌ను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరుతున్నారని, ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు వల్ల ఆ సమస్యలు తీరుతాయన్నారు. దుబాయ్‌లో ఇటీవల అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్లు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. మీడియేషన్ ఆర్బిట్రేషన్ సెంటర్‌ను ప్రోత్సహించాలని ఆయన చెప్పారు. ఈ సెంటర్ వల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. సమయం కూడా చాలా ఆదా అవుతుందన్నారు.

సెంటర్ గురించి అందరికీ తెలిసేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలంగాణ చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీని కోరారు. ఈ మీడియేషన్ సెంటర్ ను ఎలా వాడుకోవాలన్న దానిపై అవగాహన కల్పించాలన్నారు. 1926లో మొదటి అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ ప్రారంభమైందని చీఫ్ జస్టిస్ తెలిపారు.

ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ ఏర్పాటులో తెలంగాణ సహకారం మరువలేమన్నారు. ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు అయితే అంతర్జాతీయ ఆర్బిట్రేటర్లు ఇక్కడకు వస్తారన్నారు. పెట్టుబుడిదారులు వివాదాలు లేని వాణిజ్యాన్ని కోరుకుంటున్నారని, అలాంటి వాళ్లకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని సీజే తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు చీఫ్ జస్టిస్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే సెంటర్ ఫంక్షనింగ్ ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్బిట్రేషన్ సెంటర్ సక్సెస్ కావాలని ఆయన కోరుకున్నారు. కేవలం అంతర్జాతీయ ఇన్వెస్టెర్లే కాదు, స్థానిక పెట్టుబడిదారుల వివాదాలను కూడా ఇక్కడ పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీతో పాటు మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తేజస్ యుద్ధ విమానమెక్కిన ఉపరాష్ట్రపతి వెంకయ్య..

బెంగుళూరు, ఆగష్టు 20:: కర్నాటక రాజధాని బెంగుళూరులో ఉన్న హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) కంపెనీ కేంద్రాన్ని ఇవాళ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సందర్శించారు.

తేజస్‌తో పాటు లైట్ కంబాట్ హెలికాప్టర్లు తయారు అవుతున్న ఉత్పత్తి కేంద్రాలను ఆయన పరిశీలించారు. అయితే ఆ సమయంలో తేజస్ యుద్ధ విమానంపై ఉపరాష్ట్రతి వెంకయ్యనాయుడు ఎక్కి కూర్చుకున్నారు. పైలట్లు కూర్చునే సీటులో కూర్చున్న వెంకయ్యనాయుడు ఆ యుద్ధ విమాన శక్తిసామర్థ్యాలు అడిగి తెలుసుకున్నారు.

హెచ్ఏఎల్ కార్యక్రమంలో కర్నాటక గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లోట్ కూడా పాల్గొన్నారు.

మలేరియా మూలాలను తెలియజెప్పిన గొప్ప వ్యక్తి సర్ రోనాల్డ్ రోస్ :తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ , ఆగష్టు 20: మలేరియా వ్యాధి కారక మూలాలను ప్రపంచానికి తెలియజెప్పిన గొప్ప వ్యక్తి సర్ రోనాల్డ్ రోస్ అని రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేట్‌లోని సర్ రోనాల్డ్?రోస్ ఇనిస్టిట్యూట్‌లో ప్రపంచ దోమలదినోత్స వం సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోనాల్డ్ రోస్ పోస్టల్ కవర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సంధర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఇదే భవనంలో అనేక పరిశోధనలు చేసి 1897 ఆగస్టు 20న మలేరియా మహామ్మారి మూలాలను రోనాల్డ్?రోస్ తెలిపారని అన్నారు. రోనాల్డ్?రోస్ కృషికి ఫలితంగా 1902లో నోబెల్ బహుమతి రావటం వైద్య చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిందన్నారు. మలేరియా వ్యాధి బారిన పడి చనిపోతున్న వ్యాధి గ్రస్తులను చూసి చలించిపోయిన రోనాల్డ్ రోస్ వారిని కాపాడాలనే లక్ష్యంతో అనేక పరిశోధనలు చేశారని అన్నారు.

రోనాల్డ్ రోస్ పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న మంత్రి తలసానిపాల్గొన్న ప్రొఫెసర్స్ఈ వ్యాధి వ్యాపించడానికి ఆడ ఎనాఫిలిస్ దోమ కారణమని తెలుసుకున్న రోనాల్డ్ రోస్ వాటి వృద్ధిని నివారించడానికి తగు సూచనలు చేసి మలేరియా మహమ్మారి నుంచి ఈ ప్రపంచానికి విముక్తి కలిగించారని చెప్పారు. ఈ దోమలు నిల్వ ఉన్న నీటిలో అభివృద్ధి చెంది ఒక మనిషి నుంచి మరో మనిషికి ఈ వ్యాధిని వ్యాపింపజేస్తాయని తెలిపారు. నీటిలో దోమలు లార్వా దశలో ఉన్నప్పుడు వాటి పెరుగుదలను సులువుగా నివారించవచ్చు. తద్వారా వ్యాధి బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. ఇంకా ప్రజల్లో దానిపై సరైన అవగాహన లేకపోవడం. కొంతమంది పారిశుద్ధ్య నిర్వహణను పట్టించుకోకపోవడం వంటి కారణాలతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని మంత్రి విచారం వ్యక్తం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంద్వారా వ్యాధులబారిన పడకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. నేటి విద్యార్థు లకు, యువ శాస్త్రవేత్తలకు ఈ భవనానికి ఉన్న ప్రాధాన్యత, చరిత్రను తెలియజేసేలా అనేక కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రవిందర్, బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, ప్రొఫెసర్‌లు లక్ష్మీ నారాయణ, రెడ్యానాయక్, బాలకిషన్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీకాల కొరత : 45 ఏండ్లు పైబడిన వారిలో 50 శాతం మందికే తొలి డోసు!

ముంబై, ఆగష్టు 20:: కరోనా వ్యాక్సిన్ల కొరతతో మహారాష్ట్రలో 45 ఏండ్లు దాటిన వారిలో కేవలం 50 శాతం మందికి మాత్రమే ఇప్పటివరకూ కొవిడ్-19 వ్యాక్సిన్ తొలిడోసు ఇవ్వగలిగారు. మహారాష్ట్రలో నమోదైన కరోనా మరణాల్లో 45 ఏండ్లు పైబడిన వారు 58 శాతం మంది ఉన్నారని నివేదికలు వెల్లడిస్తున్నక్రమంలో వ్యాక్సినేషన్ రేటు మందకొడిగా ఉండటం ఆందోళన రేకెత్తిస్తోంది. ఆగస్ట్ నాటికి 45 ఏండ్లు పైబడిన వారిలో 70 శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్న లక్ష్యం కూడా టీకాల కొరతతో నెరవేరలేదు. ఇక ఈ ఏజ్ గ్రూప్‌లో కేవలం 25.6 శాతం మందికి మాత్రమే వ్యాక్సిన్ రెండు డోసులు పూర్తయ్యాయి. 45 ఏండ్లు పైబడిన వారికి వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈ ఏడాది మార్చిలో ప్రారంభం కాగా టీకాల కొరత వేధిస్తోంది. మరోవైపు జిల్లాల వారీగా వ్యాక్సినేషన్ రేటులో వ్యత్యాసాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో మూడు నెలల నుంచి టీకాలు నిండుకున్నాయని అప్పటి నుంచి పలుమార్లు టీకాల సరఫరా చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసినా ఎలాంటి ఫలితం లేదని అధికారులు పేర్కొంటున్నారు. కరోనా తదుపరి వేవ్‌లను అధిగమించాలంటే వ్యాక్సినేషన్ ప్రక్రియను ముమ్మరంగా చేపట్టాల్సి ఉందని చెబుతున్నారు.

పోలీసు, సాయుధ బలగాల ఎంపికలో దివ్యాంగులకు మినహాయింపులు రద్దు

న్యూఢిల్లీ, ఆగష్టు 20:: కేంద్ర పోలీసు, సాయుధ బలగాల ఎంపికల్లో వికలాంగులకు మినహాయింపులు ఎత్తివేస్తూ కేంద్రం కీలక నిర్ణయం వెలువరించింది. ప్రభుత్వ ఉద్యోగాలలో వికలాంగులకు (పీడబ్ల్యూడీ) తప్పనిసరి 4% రిజర్వేషన్ నుండి భారతీయ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) కింద ఉన్న పోస్టులకు కేంద్రం మినహాయింపునిచ్చింది. ఇండియన్ పోలీస్ సర్వీస్ సహా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఢిల్లీ, అండమాన్, లక్షద్వీప్, దామన్, దాద్రానగర్ నగర్ హావేలి పోలీసు, కేంద్ర సాయుధ బలగాలు బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ, అసోం రైఫిల్స్‌లోని అన్ని రకాల ఉద్యోగాలకు వికలాంగులకు ఉన్న పలు మినహాయింపులను కేంద్రం రద్దు చేసింది. కేంద్ర వికలాంగుల శాఖ ఛీఫ్ కమిషనర్‌తో సంప్రదింపుల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటూ కేంద్ర సామాజిక న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సబితారెడ్డిని కలిసిన మన్‌సాన్‌పల్లి గ్రామస్థులు

మహేశ్వరం, ఆగష్టు 20::గ్రామాలభివృద్ధి కొరకు తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామస్తులు ఉపసర్పంచ్ బురవోని నర్సింహ్మయాదవ్ ఆధ్వర్యంలో మంత్రిని కల్సి గ్రామాభివృద్ధికి సహకారమందించాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే అన్ని గ్రామాలు అభివృద్ధిపథంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారిని గ్రామాభివృద్ధిలో పాలుపంచుకునే విదంగా కృషిచేయాలని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కందిరవేష్,మురళీధర్‌రెడ్డి,మాజీ సర్పంచ్‌లు జాన్‌రెడ్డి,మల్లేష్‌యాదవ్,సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ యువతపై యూపీ సీఎం హామీల జల్లు..!

లక్నో, ఆగష్టు 20:: వచ్చే ఏడాది ప్రథమార్థంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అక్కడి యువతపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలోని కోటి మంది యువతకు ఉచితంగా స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు అందించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర యువత డిజిటల్ సాధికారిత కోసమే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. బుధవారం యూపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సప్లిమెంటరీ బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇస్తూ యూపీ సీఎం యోడీ పై హామీలు గుప్పించారు.

ముఖ్యమంత్రి సమాధానం అనంతరం రూ.7,301 కోట్ల సప్లిమెంటరీ బడ్జెట్‌కు మూజువాణి ఓటుతో ఆమోదముద్ర పడింది. అంతకుముందు అసెంబ్లీ మాట్లాడిన యూపీ సీఎం.. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర యువతను అస్సలు పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. దాంతో వారు బలవంతంగా అనైతిక కార్యకలాపాలకు పాల్పడి జైలు పాలయ్యేవారని చెప్పారు. కానీ బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర యువత అభివృద్ధిని కోరుకుంటున్నదని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి సరిగా లేకపోవడంవల్ల గతంలో రాష్ట్ర యువత ఇండ్ల నుంచి బయటికి రావాలంటేనే బయపడేవారని, కానీ, ఇప్పుడు దేశంలో ఎక్కడికైనా వెళ్తున్నారని, తాను యూపీకి చెందిన వ్యక్తిని అని గర్వంగా చెప్పుకుంటున్నారని యోగీ ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్ర యువతలో డిజిటల్ సాధికారతను కోరుకుంటున్నదని, తాజా బడ్జెట్‌లో రూ.3,000 కోట్లు యువత కోసమేనని చెప్పారు.

గాజుల అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చిన ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

హైదరాబాద్ , ఆగష్టు 20:శ్రావణ శుక్రవారం సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు గాజుల అలంకారంతో భక్తులకు దర్శనిమిచ్చారు. ఓ వైపు వరలక్ష్మీ వ్రత పర్వదినం, మరో వైపు అమ్మవారిని గాజులతో అలంకరించడంతో దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అమ్మవారికి పూలు, పండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆల

పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా వరలక్ష్మీవ్రతం

తిరుపతి, ఆగష్టు 20: : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం శాస్త్రోక్తంగా జరిగింది. విష్వక్సేనారాధనతో ప్రారంభించి పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోతర శత నామావళి తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామర, వృక్షి తదితర పుష్పాలతో ఆరాధించారు. అదేవిధంగా అమ్మవారిని 9 గ్రంథులతో అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం మహత్యాన్ని, ఆచరించాల్సిన విధానాలను ఆగమ పండితుడు శ్రీ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఐదు రకాల కుడుములతోపాటు 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు.

అనంతరం మహా మంగళ హరతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. భక్తుల కోసం శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. కార్యక్రమంలో టీటీడీ బైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, రాష్ట్ర మంత్రి వేణుగోపాల కృష్ణ టీటీడీ ఈఓ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి జేఈఓ సదా భార్గవి, సీవీఎస్ఓ గోపీనాథ్ జెట్టి, అదనపు సీవీఎస్ఓ శివకుమార్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ కస్తూరి బాయి, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ వ్యస్త్యాగ - త్రేజ స్త్యాగ -
చక్కబుల్బుట పంగ కటుగు సంపాదికుడగా
సక్షిత్వం తుడాగ వెలుగ
సక్షిం చుచు సుం దుకుహిటు లావె సకేంద్రనే !!

(ఆగష్టు 21 ఆలె నరేంద్ర జయంతి..) -రాధశ్రీ

సెల్: 9494481210

ప్రపంచ భాషలో పట్టు - అంతర్జాతీయ గుర్తింపుకు తొలి మెట్టు

గతంలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల బాధ్యతగా (ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్, ఈయల్‌టి) ఇంగ్లీష్ వ్యాకరణం, ఉచ్చరణ, కవితలు, వ్యాసాలు, చిన్న కథలు, నాన్ డీటేయిల్ వంటి పాఠ్యాంశాల బోధనతో పాటుగా విద్యార్థుల్ని పరీక్షలకు తయారుచేయడం, మార్కుల సాధన, ఉత్తీర్ణత శాతం పెంపు లాంటి విధులకు మాత్రమే పరిమితం అయ్యే వారని మనకు తెలుసు. నేటికీ అంతర్జాతీయ ఆంగ్ల భాష, ప్రాంతీయ మాతృ భాష తెలుగు, జాతీయ భాష హిందీ లాంటివి వార్షిక పరీక్షలకు ముందు బోధించడం, ఒకటి రెండు వారాలు చదివి పరీక్షలకు హాజరు కావడం అలవాటైంది. విద్యాలయాల్లో భాష బోధకులకు ప్రాధాన్యత, వేతనం, పని దినాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సుల ఆకర్షణలో గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం (వృక్ష జంతు శాస్త్రాలు) పట్ల అపరిమిత ప్రేమను ఒలకబోస్తూన్న కళాశాలలు, ఉపన్యాసకులు, తల్లితండ్రులు, విద్యార్థులు భాషలకు సంబంధించిన అంశాలను పాతాళంలోకి తొక్కేస్తున్నారు. కోర్సు పూర్తి అయిన తరువాత ఇంగ్లీష్ కమ్యునికేషన్ స్కిల్స్ పొందడానికి అధిక ఫీజులతో ప్రత్యేక ట్యుటోరియల్ క్లాసులు పూర్తి చేయాల్సిరావడం దురదృష్టకరం. నేటి పట్టభద్రుల్లో అధికశాతం యువతకు మాతృభాష తెలుగు సులభంగా వ్రాయడం, చదవడం రాకపోవడమే కాకుండా చులకన భావాల్ని కలిగి ఉండడంతో పాటు ఆంగ్లభాష సంభాషణా సామర్థ్యంలో కూడా వెనుకబడే ఉంటున్నారు. అటు తెలుగు, ఇటు ఇంగ్లీష్ భాషా పటిమ నేటి యువతకు అందని ద్రాక్షే అవుతున్నదని అర్థం అవుతున్నది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచమే కుగ్రామమైన వేళ ఆంగ్ల భాషా బోధనలకు కొత్త రెక్కలు తొడగాల్సిన సమయం ఆసన్నమైంది. శాస్త్రసాంకేతిక విజ్ఞాన నైపుణ్యాలతో పాటు ఆంగ్ల భాషలో పట్టు (కమ్యునికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్) కనీస అర్హత అయ్యింది. దీనికి తోడుగా ఉద్యోగ నియామకాల్లో సమకాలీన జాతీయ అంతర్జాతీయ అంశాల మౌళిక అవగాహనకు కూడా అధిక ప్రాధాన్యతలను ఇవ్వడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్ల (ఈయల్‌టి) బోధనా పరిధి మరింత విస్తృతమైంది. జాతీయ అంతర్జాతీయ సమకాలీన సామాజిక అంశాలైన పేదరికం, అసమానతలు, కులమత వివక్షలు, అవిద్య, నిరుద్యోగం, ప్రజారోగ్యం, మానవ హక్కులు, అనైతిక ధోరణుల పట్ల లోతైన అనగాహన కల్పించాల్సిన కనీస బాధ్యత ఈయల్‌టిల మీద ఉన్నదని గమనించాలి. ఇదే కోణంలో ఇంగ్లీష్ సెలబస్‌ను సవరించుట జరగాలి. విద్యార్థుల్లో సృజన, రచనాశైలి, వినుత్న ఆలోచనలు, సంక్లిష్ట ఆలోచనా నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలు, సమకాలీన సమస్యలపై అవగాహన, ఆంగ్ల భాష మాట్లాడడంలో నేర్పరితనం, ప్రపంచ ఆంగ్ల అవసరాలకు విద్యార్థుల్ని తయారు చేయడం లాంటి బహుముఖీన అంశాలకు అధిక ప్రాధాన్యతను ఈయల్‌టిలు ఇవ్వాల్సి ఉంది. నేడు ఆంగ్ల భాష సెకండ్ లాంగ్వేజ్ లేదా విదేశీ భాష మాత్రమే కాదు, అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషగా యువత గుర్తించటానికి కృషి చేయాల్సిన బాధ్యత ఈయల్‌టిల మీద పడింది. నేటి యువత విదేశీ విశ్వవిద్యాలయ చదువుల వైపు ఆకర్షించబడుతున్న వేళ ఆంగ్ల భాష బోధనలో గ్లోబల్ సమస్యలైన లోకల్ కృషీలో భాగంగా ప్రపంచ శాంతి, మానవ హక్కులు, మనవ సమాజ సమగ్రాభివృద్ధి, పర్యావరణ విద్యలకు సహితం పెద్ద పీట వేయాల్సిన సమయం ఆసన్నమైంది.

రాబోయే తరాన్ని బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుటలో ఇంగ్లీష్ టీచర్ల పాత్ర ప్రముఖమైందని గమనించాలి. ఆంగ్ల భాష పాఠ్యాంశాల్లో పేదరికం, ఆహార భద్రత, లింగ బేధం, వాతావరణ మార్పులు, పారిశ్రామిక సుస్థిరాభివృది, అసమానతల్ని తగ్గించడం, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత లాంటి అంశాలను చేర్చాల్సిన విషయాన్ని ఇంగ్లీష్ భాషానిపుణులు గుర్తుంచుకోవాలి. ఐక్యరాజ్యసమితి రూపొందించిన సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (యస్‌డిజి) పట్ల లోతైన జ్ఞానాన్ని కలిగించుటలో చొరవ చూపాలి. విదేశీ విద్యార్జనకు సమాయత్తం అవుతున్న యువతకు ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్ ప్రాధాన్యత నేడు అర్థం అవుతున్నది. పాఠశాలలోనే విద్యార్థులకు ఇంగ్లీష్, హిందీ, తెలుగు లాంటి భాషల పట్ల అభిరుచి కలిగేలా బోధనలు జరగాలి. ఆంగ్ల భాషాబోధకులు ఉపాధ్యాయులు మాత్రమే కాదని, భవిష్యత్ యువత ప్రవర్తన, వ్యక్తిత్వం, గుణగణాలను తీర్చిదిద్దే 'నవ్య గురువు'లని గుర్తించాలి. ప్రపంచీకరణ, డిజిటలైజేషన్, సాఫ్ట్‌వేర్ బూమ్ లాంటి ఆధునిక లోకపోకడలకు ఆంగ్ల భాష పునాదిగా మారుతోంది. డిజిటల్ యుగపు అంతర్జాల విప్లవంలో సమాచారం అరచేతుల్లో నిలుస్తున్నది. అయినప్పటికీ విద్యార్థులతో పలు చిన్న చిన్న భాషాధార పరిశోధనా ప్రాజెక్టులు చేయించడం మంచి ఫలితాలను ఇస్తాయని అంటున్నారు. భూగ్రహంపై ఉన్న ఏ దేశంలోనైనా భారతీయ యువత గొంతు పెకలాలంటే ఆంగ్లభాషను ఆశ్రయించి, ఆరాధించి, అవగాహన చేసుకోవలసిందే. ప్రపంచ మానవాళితో ముచ్చటించడానికి ఆంగ్ల సంభాషనా చాతుర్యమే ఆధారమని తెలుసుకుందాం, భారతీయతను ఆంగ్లంలో అంతర్జాతీయ వేదికపై పట్టాభిషేకం చేద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

స్వల్పంగా తగ్గిన డీజిల్ ధరలు..

హైదరాబాద్ , ఆగష్టు 20:దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు సమాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. గత నాలుగు నెలల నుంచి వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవల స్థిరంగా ఉంటున్నాయి. అయితే ఎట్టకేలకు డీజిల్ ధరలు ఇవాళ స్వల్పంగా తగ్గాయి. వరుసగా మూడో రోజు కూడా డీజిల్ ధర తగ్గింది.. ఇవాళ లీటర్ డీజిల్‌పై 25 పైసల మేర కోత పెట్టాయి ఆయిల్ సంస్థలు.. దీంతో ఢిల్లీలో లీటర్ డీజిల్ ధర 20 పైసలు తగ్గి.. రూ.89.27కి దిగివచ్చింది. పెట్రోల్ ధర రూ.101.84గా కొనసాగుతోంది.. ఇక, ముంబైలో లీటర్ పెట్రోల్ రూ.107.83గా ఉండగా.. డీజిల్ ధర రూ.96.84గా ఉంది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.99.47గా ఉంటే.. డీజిల్ ధర రూ. 93.84కి తగ్గింది. ఇక, కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.08గా ఉంటే.. లీటర్ డీజిల్ ధర రూ.92.52గా ఉంది. మరోవైపు.. హైదరాబాద్‌లో లీటర్ డీజిల్‌పై 20 పైసలు తగ్గడంతో లీటర్ డీజిల్ ధర రూ.97.33కి తగ్గగా.. లీటర్ పెట్రోల్ ధర రూ.105.83గా కొనసాగుతోంది. చమురు ధరలు పెరగడంతో ట్రాన్స్ పోర్ట్ చార్జీలు పెరుగుతాయి. ఫలితంగా అన్ని వస్తువలపై రేట్లు పెరుగుతాయి.

ఇకపై ఇంటింటికి వైద్య సర్వే..

హైదరాబాద్ , ఆగష్టు 20:తెలంగాణ రాష్ట్ర ప్రజల హెల్త్ ప్రొఫైల్ ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మేరకు మంత్రి కేటీఆర్ వివరాలు వెల్లడించారు. మంత్రుల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఐటీ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ? బీపీ, మధుమేహం, ప్రాథమిక రక్త, మూత్ర పరీక్షలను అక్కడికక్కడే నిర్వహిస్తారని అన్నారు. ఎవరికైనా అదనపు పరీక్షలు అవసరమనుకుంటే స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్లకు పంపి, పరీక్షలు చేయిస్తారని వివరించారు. వైద్య ఆరోగ్య రంగంలో వ్యాధుల ట్రెండ్స్, వాటి నివారణ, ఇతర కార్యక్రమాల తయారీలో ఈ ప్రాజెక్టు సహకారం అందిస్తుందని తెలిపారు.

ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్య సహకారం అందించేందుకు ఈ ప్రాజెక్టు సమాచారం దోహద పడుతుందని వివరించారు. హెల్త్ ప్రొఫైల్ రికార్డ్ ప్రాజెక్టు కోసం ములుగు, సిరిసిల్ల జిల్లా ల ఎంపిక చేశామన్నారు. ఈ రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని? ప్రజల ప్రాథమిక ఆరోగ్య సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే, వారికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడంలో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ రెండు జిల్లాల్లోని వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటి వద్దే ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక వివరాలను సేకరిస్తారని తెలిపారు.

నోవాటెల్‌లో లిమోసిన్ క్యాబ్ సర్వీసెస్ ప్రారంభం

హైదరాబాద్ , ఆగష్టు 20:మాదాపూర్‌లోని నోవాటెల్‌లో సినీ నటి క్యాథరిన్ ట్రెసా ఎంటీసి గ్రూఫ్ చైర్మెన్ అసాద్ అహ్మద్ ఖాన్‌తో కలిసి గురువారం లిమోసిన్ క్యాబ్ సర్వీసెస్ను జెండా ఊపి ప్రారంభించింది. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలను దృష్టిలో ఉంచుకొని వారికి రక్షణ అందించేందుకు లిమోసిన్ క్యాబ్ సర్వీసెస్ సరికొత్త ఆవిష్కరణ చేసింది, మహిళలు ఎక్కడికైనా వెళ్ళాలని క్యాబ్ బుక్ చేసుకున్నట్లయితే వారి కొరకు ప్రత్యేకంగా మహిళ డ్రైవర్‌లే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.నగరంలో 5 వేలకు పైగా క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నట్లు సంస్థ చైర్మెన్ అసాద్ అహ్మద్ ఖాన్ తెలిపారు. క్యాబ్ బుక్ చేసుకోవాలనుకునే వారు కేవలం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సరిపోతుందని, క్యాబ్ సర్వీస్లను సరికొత్త టెక్నాలజీతో వినియోగదారుల కొరకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందులో సాధారణ, లగ్జరీ కార్ల సర్వీస్లను ఉంచినట్లు తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతర ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామియాదవ్,ఎదురుగట్ల సర్పంచ్ సోమినేని కరుణాకర్ మాట్లాడుతూ భారత దేశపు యువ ప్రధానిగా అత్యంత చిన్న వయసులోనే ప్రధానమంత్రి గా సేవలందించిన రాజీవ్ గాంధీ యువత పట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత దేశానికి పరిచయం చేసిన ఆధునికత వేత్త, యువత కు ఆదర్శ, మార్గదర్శకాలు చూపించిన గొప్ప భారత ప్రధాని గా కీర్తించ బడ్డ అయన ఆశయా సాధన కొరకు కార్యకర్తలు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో లింగపల్లి కిరణ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు .

వాహనదారులకు హెచ్చరిక.. రూల్స్ పాటించకుంటే 15 రోజుల్లో నోటీసులు

హైదరాబాద్ , ఆగష్టు 20:వాహనదారులు ఇకపై అప్రమత్తంగా ఉండాల్సిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే వాహనదారులకు కష్టమే. ఎందుకటే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు రాష్ట్రాల్లోని సంబంధిత విభాగాలు ఇక నుండి 15 రోజుల్లోగా నోటీసు జారీ చేయాలని కేంద్రం సూచించింది.

ఈ మేరకు పోలీసులు జారీ చేసిన ఛలాన్‌లో ఉండే డబ్బు చెల్లించకపోతే వాహనదారుడు చెల్లించే వరకూ కూడా ఎలక్ట్రానిక్ రికార్డును జాగ్రత్తగా ఉంచాలని కేంద్రం చెప్పింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ కొత్త నియమాలను అమల్లోకి తీసుకొస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేయడం కూడా జరిగింది. మోటార్ వాహన చట్టం 1989 ఇటీవల సవరణలు చేసిన విషయం తెలిసిందే.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు గుర్తించడానికి స్పీడ్ కెమెరా, సీసీటీవీ కెమెరా, స్పీడ్ కం డాష్ బోర్డ్ కెమెరా మొదలైనవి రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చని తెలిపింది. అదే విధంగా ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్న జాతీయ రహదారులు రాష్ట్ర రహదారులు ప్రస్తావించిన 132 నగరాలతో పాటు పది లక్షలకు పైగా జనాభా ఉన్న అన్ని నగరాల్లో ఈ ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయడానికి కూడా సిద్ధమైంది. అయితే పలువురు నిబంధనలను అతిక్రమించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు నిబంధనలు బ్రేక్ చేయకుండా ఉండటం మంచిది. ఒకవేళ కనుక ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులకు రాష్ట్రాల్లోని సంబంధిత విభాగాలు ఇక నుండి 15 రోజుల్లోగా ఈ-చలాన్ జారీ అవుతుంది.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 72 సీట్లు పక్కా!

హైదరాబాద్ , ఆగష్టు 20:తెలంగాణలో పుర్వ వైభవం కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకుంది. 2023 ఎన్నికల్లో జరిగే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా పలు విధాలుగా ఆందోళనలు, ఉద్యమాలు చేస్తోంది. ఈ క్రమంలో దళిత దండోరా అంటూ సభలు నిర్వహిస్తూ ప్రజలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే టీ.పీపీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి, రావిర్యాలలో సభలు నిర్వహించి.. కార్యకర్తల్లో విశ్వాసం నింపింది. వచ్చే నెలలో వరంగల్ లో మరో సభకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం ఆహ్వానించింది. రాహుల్ రాకతో పార్టీ కార్యకర్తల్లో మరింత ఉత్తేజాన్ని నింపాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

'దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరా' పేరిట నిర్వహిస్తున్న సభలు విజయవంతం కావడంపై పార్టీ నాయకులు జోష్ లో ఉన్నారు. రెట్టింపు ఉత్సాహంతో మరన్ని కార్యక్రమాలకు ప్రణాళికలు రచిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరిగినట్లు అంచనా వేస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు 72 సీట్లు వస్తాయని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి రహస్యంగా ఓ సర్వే చేయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ కొత్త కమిటీపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణికం ఠాగూర్ కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. సమన్వయకర్తలు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. కేసీఆర్ అవినీతి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ అగ్రనాయకత్వం పార్టీ నేతలకు పిలుపునిచ్చింది. త్వరలో హుజురాబాద్ ఉప ఎన్నికల జరగనున్న నేపథ్యంలో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సీనియర్ నేతలు విస్తృత చర్చలు జరుపుతున్నారు.

గౌరవం లేని చోట ఉండి ఏం లాభం: టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల సంచలన వ్యాఖ్యలు

అమరావతి, ఆగష్టు 20:టీడీపీ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. పార్టీని వీడినున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ అధినేత చంద్రబాబు, నేతలు బుజ్జగించినా.. ఆయన తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం లేదని తెలుస్తోంది. పార్టీ నాయకత్వంలో మార్పు రావాలంటూ గతంలో చాలా సందర్భాల్లో గోరంట్ల బహిరంగంగా వ్యాఖ్యానించారు. పార్టీ సీనియర్ అయిన తనను పట్టించుకోకపోవడంతో అసంతృప్తిలో ఉన్న ఆయన? టీడీపీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం జరుగుతోంది.

ఈ క్రమంలో ఆయన ఓ న్యూస్ ఛానల్‌తో లైవ్ డిబేట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గౌరవం లేని చోట ఉండి ఏం లాభమని వ్యాఖ్యానించారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తాను ఏం అడగలేదని.. ఎలాంటి కాంట్రాక్ట్‌లు చేయలేదన్నారు

. చంద్రబాబు, లోకేష్ తాను ఫోన్ చేసినా తీయలేదని.. పట్టించుకోకపోయినా పర్లేదు అనే భావన కావొచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నడిపే విధానంలో కార్పొరేట్ స్టైల్ వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. గుమస్తాలు పార్టీని నడుపుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంటరీ కమిటీలు అనవసరంగా తీసుకొచ్చారన్నారు. దీని వల్ల పార్టీ నష్టపోయిందన్నారు.

పార్టీ మారితే ఎంతో మంది నెత్తిన పెట్టుకున్నారని గోరంట్ల అన్నారు. కారెం శివాజి, జూపూడి, ఆది నారాయణరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్‌లకు ఎందుకు పదవులు ఇచ్చారని ప్రశ్నించారు. వాళ్లంతా మళ్లీ పార్టీ ఎందుకు మారారని.. ఇలాంటి వాళ్లతో పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్ట పడుతున్నవారికి విలువ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారిన వారికి ఉన్న విలువ పార్టీలో ఉన్నవాళ్లకు లేదన్నారు. పార్టీ జెండా మోసిన వాడిని కాదని.. ఎవర్నో తెచ్చి నెత్తిన పెట్టుకుంటే ఎలా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో కూడా అదే జరిగిందని..అందుకే పార్టీ ఘోరంగా ఓడిపోయిందని గోరంట్ల వ్యాఖ్యానించారు. తాను మొదటి నుంచి పార్టీని తన జీవితంగా అనుకున్నానని చెప్పారు. నిర్ణయాలు విషయంలో ఇంకా చాలా మార్పు రావాలని గోరంట్ల పేర్కొన్నారు.

వందశాతం వ్యాక్సినేషన్ నగరంగా మారనున్న హైదరాబాద్

హైదరాబాద్ , ఆగష్టు 20: రాబోయే 10-15 రోజుల్లో హైదరాబాద్‌ను వంద శాతం కోవిడ్ వాక్సినేషన్ జరిగిన నగరంగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, డీఎంహెచ్‌వోలు, ఎస్‌పీహెచ్‌వోలతో నగరంలోని బీఆర్‌కేఆర్ భవన్‌లో గురువారం వర్క్‌షాప్ నిర్వహణ జరిగింది.

ఈ సందర్భంగా సీఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని కాలనీలను 100% వాక్సినేషన్ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు శాసనసభ్యులు, స్థానిక కార్పొరేటర్లను భాగస్వాములను చేస్తూ, జీహెచ్ఎంసీ, ఆరోగ్యశాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఇంటింటికి తిరిగి సర్వే జరిపి 18 సంవత్సరాలపై బడిన అర్హత కలిగిన వ్యక్తులను మాప్ అప్ చేయాలని తెలిపారు. ఒక ఉద్యమముగా ఈ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు.

మొబైల్ వాక్సినేషన్‌కు మంచి స్పందన వస్తున్నట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో ఇంటింటికి తిరిగి మిగిలిన వ్యక్తులకు వాక్సినేషన్ చేసేందుకు సిబ్బంది, మెటీరియల్‌తో కాలనీల వారీగా టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, మేడ్చల్ ? మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎస్. హరీష్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం. హన్మంత రావు, డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా.శ్రీనివాస్ రావు, ఓఎస్డి టు సీఎం డా.గంగాధర్, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంటటి, రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్య లక్ష్మి, మేడ్చల్ మల్కాజిగిరి డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్, సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా. గాయత్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

యువతిపై పెట్రోల్ దాడి.. దిశ యాప్ తో రక్షించామన్న మంత్రులు

విజయనగరం, ఆగష్టు 20: విజయనగరం జిల్లా చౌడువాడలో యువతిపై పెట్రోల్ దాడి దురదృష్టకరమని మంత్రులు పుష్ప శ్రీవాణి, బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెట్రోలు దాడిలో గాయపడిన బాధితురాలిని ఏపీ మంత్రులు పుష్పశ్రీవాణి, బొత్స సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ.. బాధితురాలికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని చెప్పారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడన్నారు. దిశ యాప్ కారణంగానే బాధితులను సకాలంలో కాపాడగలిగామని తెలిపారు. యాప్ నుంచి సమాచారం వచ్చిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించారని చెప్పారు. ఇలాంటి ఘటనల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

బాధితులకు మెరుగైన చికిత్స కోసం విశాఖ స్టీల్ ప్లాంట్ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు చెప్పారు.

దళితబంధు దేశానికే ఆదర్శం: ఎంపీ రంజీత్‌రెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 20:శంషాబాద్ రూరల్:దళిత బంధు పథకం దేశానికే ఆదర్శమని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజీత్‌రెడ్డి అన్నారు. గురువారం శంషాబాద్ మండలంలోని కవ్వగూడ గ్రామ సర్పంచ్ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు చేవెళ్ల ఎంపీ ఇంటికి వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజీత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అమలు చేస్తున్న దళితబంధు పథకం దేశానికే ఆదర్శమని కొనియాడారు.

తెలంగాణలోని దళితులు ఆర్థికంగా వెనుకబడి అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు రావడంతో ఆయన దళితుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అర్థమౌతుందన్నారు. కార్యక్రమంలో కవ్వగూడ గ్రామ టీఆర్ఎస్ నాయకులు అనిల్‌గౌడ్, సురేష్ ముదిరాజ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సైబర్ ఆర్థిక మోసాల కు గురైతే 24 గంటలోపు ఫిర్యాదు చేయాలి

ఫిర్యాదు చేయవలసిన నంబర్ 155260 లేదా డయల్ 100

-పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): సైబర్ ఆర్థిక మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న బాధితులు 24 గంటల వ్యవధిలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ అన్నారు వేములవాడ పట్టణ పరిధిలో తిప్పాపూర్ వద్ద ప్రజలకు సైబర్ నేరాల గురించి వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలం లో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయి అని, బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాం అకౌంట్ బ్లాక్ అయింది అని, ఎటిఎం పిన్ మార్చుకోవాలి అని మీ ఖాతా వివరాలు, ఎటిఎం వివరాలు చెప్పమని ఎవరైనా అడిగితే చెప్పకుండా మీ బ్యాంకు ని సంప్రదించండి అంతే కానీ సైబర్ మోసగాళ్ల వలలో చిక్కకూడదు అని, సైబర్ నేరగాళ్ళు ఏసీ రూముల్లో కూర్చొని మీరు కష్టపడిన డబ్బులు చాలా సులభంగా కొట్టేస్తారు అని దానికి మీరు చిక్కకుండా ఉండాలి అని సోషల్ మీడియా వేదికగా కూడా డబ్బులు అడిగే అవకాశం వుంది కాబట్టి జాగ్రత్త గా ఉండాలి అని, ఎవరు కూడా ఫ్రీగా డబ్బులు ఇవ్వరని గుర్తుంచుకోవాలి ఆఫర్స్ చూపి మోసం చేస్తారు అని మీ అకౌంట్ నుండి డబ్బులు సైబర్ నేరగాళ్ల ఖాతా లోకి వెళితే 24 గంటలలో టోల్ ఫ్రీ నెంబర్ 155260 కి కాల్ చేసినట్లయితే సైబర్ నేరగాళ్ల కు మీ ఖాతా నుండి డబ్బులు వెళ్లకుండా లావాదేవీలు నిలిపివస్తారు కాబట్టి ప్రజలకు ఈ న

టెంపుల్ టౌన్‌గా వేములవాడ : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 20: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రగతి భవన్‌లో వేములవాడ ఆలయ, పట్టణాభివృద్ధి పనులపై మంత్రులు.. వీటీడీఏ, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై మంత్రులు ఆరా తీశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం అబ్బురపడే విధంగా సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయాన్ని పునఃనిర్మిస్తున్నారన్నారు. వేములవాడ ఆలయాన్ని ఆదే రీతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి, పనులు ప్రారంభించుకున్నట్లు తెలిపారు. వీటీడీఏ, దేవాదాయ, పురపాలక, రోడ్లు భవనాల శాఖ అధికారులు, స్తపతిలను భాగస్వాములను చేసి వారి సలహాలు, సూచనలు కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. వేములవాడ ఆలయ అభివృద్ధితో పాటు సమాంతరంగా పట్టణాభివృద్ధి జరగాలని, దానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలను రూపొందించుకుని అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.

రాజన్న గుడితో పాటు, వేములవాడ పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేములవాడ ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పుర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా పుష్కరిణి, కళ్యాణకట్ట, కళ్యాణ మండపం, క్యూ కాంప్లెక్స్, కళా భవనం పనులను వేగవంతం చేయాలని చెప్పారు. టెంపుల్ టూరిజంలో భాగంగా వేములవాడను సమగ్ర అభివృద్ధి చేయాలని, గుడి చెరువు చుట్టు నెక్లెస్ రోడ్ నిర్మించాలని, బోటింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేములవాడ, మిడ్ మానేరులో పర్యాటక రంగాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. దీని వల్ల టెంపుల్ టూరిజం, టూరిజం రెండు అభివృద్ధి చెందడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు.

బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని, దానికి సంబంధించిన స్థల సేకరణను వెంటనే చేపట్టాలని, విస్తరణలో ఇండ్లు, దుకాణాలు కోల్పోతున్న వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. వేములవాడలో దశల వారీగా రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టాలని, బ్రిడ్జి నుంచి గుడి వరకు రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి గ్రామీణ ప్రాంతాల నుంచి వేములవాడకు సామాన్య భక్తులు వస్తారని, బస్టాండ్ నుంచి ఆలయం వరకు ఉచిత ప్రయాణం కల్పించాలని, దానికి అనుగుణంగా మినీ ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వేములవాడ పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సాకారాలు అందించాలని పురపాలక శాఖ అధికారులకు సూచించారు. పట్టణాభివృద్ధి కోసం వచ్చిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతకుముందు మంత్రి కేటీఆర్ కు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రసాదాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ అందజేశారు. ఈ సమావేశంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, కలెక్టర్ కృష్ణ భాస్కర్, వీటీడీఏ వైస్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వేములవాడ ఈవో క్రృష్ణ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవీ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోనరావుపేట లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ 77వ జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): దివంగత మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ 77వ జయంతి వేడుకలను కోనరావుపేట మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోనరావుపేట మండల కేంద్రంలో షేక్ ఫిరోజ్ పాషాతో పాటు పలువురు మండలంలోని కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . ఈసందర్భంగా షేక్ ఫైరోజ్ పాష మాట్లాడుతూ దేశంలో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత టెలీ కమ్యూనికేషన్, ఐటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు చేసిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ సేవలు.. సంస్కరణలు నేటికి దేశ పౌరులు సజీవంగా వినియోగించు కుంటున్నారని చెప్పారు. దేశ ఐక్యత కోసం..సమానత్వం కోసం..సౌభ్రాతృత్వం కోసం కృషిచేసిన మహనీయుడన్నారు. సాంకేతిక విద్యా అభివృద్ధికి తోడ్పాటు సందించారన్నారు. దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టించిన పిదప నేడు ఈస్థాయిలో భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందంటే నాడు రాజీవ్ గాంధీ చేసిన కృషి ఫలితమే అని..రాజీవ్ గాంధీ త్యాగం దేశం ఎన్నటికి మరువదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్ల పెల్లి ప్రభాకర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొర్ర రవీందర్ , మండల నాయకులు గడిపెల్లి ఎల్లయ్య యాదవ్ దినేష్ గౌడ్ మొహమ్మద్ అజీం వంగపెల్లి శోభన్ మండాల లింబయ్య ముదామ్ సత్యం గొట్టే రవిందర్ లాంబ రాజు యాదవ్ పేంతాల శ్రీనివాస్ కమలాకర్ భూమేష్ యాదవ్ ఎక్కలదేవి అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

దుర్గమ్మ సేవలో మంత్రి ఆళ్ల నాని

అమరావతి, ఆగష్టు 20:ఉపముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఆళ్ళ కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) కుటుంబసభ్యులతో శ్రావణ శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ పైలా సోమినాయుడు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి డి.భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో ఉపముఖ్యమంత్రి కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ ఆళ్ల నాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం పాలక మండలి చైర్మన్ సోమినాయుడు ఉపముఖ్యమంత్రి ఆళ్ల నానికి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేయగా.. ఆలయ కార్యనిర్వాహణ అధికారి భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

వైఎస్ షర్మిలకు బిగ్ షాక్.. వైఎస్ఆర్టీపీకి ఇందిరాశోభన్ రాజీనామా

హైదరాబాద్ , ఆగష్టు 20:వైఎస్ షర్మిలకు బిగ్ షాక్.. వైఎస్ఆర్టీపీకి ఇందిరాశోభన్ రాజీనామాతెలంగాణలో కొత్త పార్టీ స్థాపించిన వైఎస్ షర్మిలకు భారీ షాక్ తగిలింది. ఆపార్టీ కీలక నాయకురాలు ఇందిరా శోభన్ వైఎస్ఆర్టీపీకి రాజీనామా చేశారు. పార్టీ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఉదయం ఓ ప్రకటనలో ఆమె ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఆమె పంపారు. అసలు ఎందుకు రాజీనామా చేయాలని అనుకున్నారు..? రాజీనామా వెనుక అసలు కారణాలేంటి..? రాజీనామా చేసిన తర్వాత ఏం చేయబోతున్నారు..? అనే విషయాలను ప్రకటనలో నిశితంగా ఇందిరాశోభన్ రాసుకొచ్చారు.

'తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం కలిసి కొట్లాడినం. తెలంగాణ ఆకాంక్షలు నెరవేరాలని కలలుగన్నం. వాటిని సాకారం చేసుకునేందుకు ప్రజలతో మమేకమైన నన్ను.. మీరంతా ఆశీర్వదిస్తూనే ఉన్నారు. అందుకు జీవితాంతం మీకు రుణపడి ఉంటాం. ఈ రోజు ఒక కీలక నిర్ణయం తీసుకున్నాను. అది మీరు కోరుకుంటున్నట్లుగానే షర్మిలక్క వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశాను. కారణం అమరవీరుల ఆశయాల సాధన కోసం, అన్నదాతల జీవితాల్లో ఆనందం కోసం, యువతకు, నిరుద్యోగులకు న్యాయం కోసం, దళిత, బహుజనుల, సబ్బండ వర్గాల సాధికారత కోసం, మైనార్టీల బతుకు బాగుకోసం, గిరిజనుల జీవితాల్లో వెలుగుల కోసం, మహిళలకు సమాన వాటా కోసం, కొట్లాడుతూనే ఉన్నాను. నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు కొట్లాడుతూనే ఉంటా. అందుకు షర్మిలక్క వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో ఉండకూడదని.. అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు నేను ఈ పార్టీకీ రాజీనామా చేశాను. భవిష్యత్తు కార్యాచరణను త్వరలో ప్రకటిస్తాను. ప్రజాజీవితంలోనే ఉంటా. జనం కోసమే కదులుతా. ప్రజల కోసమే అడుగులు వేస్తా. ఇదే ఆదరాభిమానాలను ఇక ముందు కూడా మీ నుంచి నాకు ఉంటాయని, నన్ను నడిపిస్తారని తెలంగాణ ప్రజలను కోరుకుంటున్నాను. ఇన్నాళ్లు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో నాకు సహకరించిన ప్రతీ నాయకుడికి, కార్యకర్తలకు పేరు పేరునా ధన్యవాదాములు"అని ఇందిరా శోభన్ పేర్కొన్నారు.కాగా, క్షేత్రస్థాయిలో ఇంకా బలపడన వైఎస్ఆర్టీపీకి చెందిని పలువురు నాయకులు ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా ఇందిరాశోభన్ కూడా గుడ్ బై చెప్పడం గమనార్హం.

వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

అమరావతి, ఆగష్టు 20:శ్రావణ శుక్రవారంతో పాటు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుండి భక్తులు దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. శ్రావణ శుక్రవారం సంధర్భంగా దుర్గాదేవి అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు. అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి వరలక్ష్మీ దేవి అలంకరణ చేశారు. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని భక్తులు చెబుతున్నారు.

శ్రావణమాసం మూడో శుక్రవారం అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరుపుతున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ముందుగానే గ్రహించిన అధికారులు అన్నిరకాల ఏర్పాట్లను చేశారు. ఇక మహిళలు కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఆలయాల్లోను భక్తుల రద్దీ ఎక్కువగానే కనిపిస్తోంది. మహిళలు పెద్ద ఎత్తున ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్నారు.

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి

మెహిదీపట్నం, ఆగష్టు 20: గణేష్ నవరాత్రి ఉత్సవాలను కోవిడ్ నియమనిబంధనల మేరకు విజయవంతంగా నిర్వహించుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి ప్రధాన కార్యదర్శి భగవంతరావు అన్నారు. గురువారం సాయంత్రం మెహిదీపట్నం జి.పుల్లారెడ్డి కళాశాలలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నూతనంగా నియమించిన కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా భగవంతరావు మాట్లాడుతూ కన్వీనర్లు ఆయా ప్రాంతాల మండపాల నిర్వాహకులు,బస్తీ సంక్షేమ సంఘాలు,ఆలయాల ప్రతినిధులు,రాజకీయలకు అతీతంగా అందరితో సమావేశాలు ఏర్పాటు చేసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు.

హిందూ ధర్మంపై అనేక అసాంఘీక శక్తులు మూకుమ్మడి దాడి చేస్తున్నాయని,ఈ నేపథ్యంలో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని భగవంతరావు అన్నారు.అనుమతుల పేరుతో పోలీసులు వేధింపులకు గురిచేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు రాఘవ రెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద ప్రశాంత వాతావరణంలో పూజలు జరపాలన్నారు.ప్రతి చోటా కోవిడ్ నియమనిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అన్నారు. ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలను మండపాల వద్ద నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందిచడానికి కృషి చేయాలని రాఘవ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికయిన కన్వీనర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై పోలీసుల మెరుపుదాడులు

-అర్ధరాత్రి నుండి ఉదయం వరకు దాడులు తీరును ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ పోలీసు బృందాలకు ఆదేశాలు జారీ చేసిన పోలీస్ కమిషనర్

19 ఇసుక లారీలు స్వాధీనం

కరీంనగర్ జూన్ 20(నేటినిజం ప్రతినిధి): ఎలాంటి అనుమతులు లేకుండా మానకొండూరు మండలం ఊటూరు-వేగురుపల్లి గ్రామశివారులోని మానేరు వాగు నుండి ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు కమిషనరేట్‌లోని ప్రత్యేక విభాగానికి చెందిన పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు మెరుపు దాడులను నిర్వహించారు. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడిన నిర్వహించిన ఈ దాడుల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా కరీంనగర్- హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్న 19లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కమిషనరేట్ ప్రత్యేక పోలీసు బృందాలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన ఈ దాడుల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్న లారీలను పోలీసులు ఛేదించిపట్టుకున్నారు. ఒక్కసారిగా పోలీసు బృందాలు మెరుపుదాడి నిర్వహించడంతో అక్రమ రవాణాదారులు లారీలను అతివేగంతో నడుపుతూ పట్టుబడకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించి నిలుపుదల చేశారు. పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ దాడులు కొనసాగుతున్న తీరును ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ ఆదేశాలు జారీచేశారు. అత్యంతవేగంతో ఇసుకలోడ్‌లతో వెళుతున్న లారీలను చేధించి పట్టుకున్న బృందాలకు చెందిన అన్నిస్థాయిలకు చెందిన పోలీసులను కమిషనర్ అభినందించడంతోపాటు రివార్డులను ప్రకటించారు. ఈ ప్రత్యేక బృందాల్లో కరీంనగర్ వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ సతీష్, టూటౌన్ ఎస్ఐ మహేష్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్లు సృజన్‌రెడ్డి, మల్లయ్యలతోపాటుగా వివిధ స్థాయిలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు. స్వాధీనం చేసుకున్న లారీలను టిఎస్‌యండి అధికారులకు అప్పగించారు.

ఇసుక అక్రమ రవాణా పై ఉక్కుపాదం

కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా ఇసుక అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులను నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేయడం, సదరు వాహనాలకు సంబంధించిన యజమానులు, డ్రైవర్లపై కేసులను నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమరవాణాకు పాల్పడ వారిని బైండోవర్ చేసే పక్రియ మొదలైందని పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా రవాణాచేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ఇసుక అక్రమరవాణా నియంత్రణకు ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు స్పెషల్‌బ్రాంచి, టాస్క్‌ఫోర్స్, క్యూఆర్‌టి విభాగాలతోపాటు ఇతర విభాగాలకు చెందిన పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. తాము కొనసాగిస్తున్న దాడులకు రెవెన్యూ, టిఎస్‌యండిసి అధికారులు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా గానీ పరోక్షకంగా గానీ సంబంధం ఉన్న వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే 24గంటల్లోపు ఫిర్యాదు చేయాలి కోల్పోయిన డబ్బు తిరిగి వాపస్ వస్తుంది

-ఫిర్యాదు చేయాల్సిన నెంబర్లు 155260 లేదా డయల్ 100

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్ జూన్ 20(నేటినిజం ప్రతినిధి): సైబర్ ఆర్థికమోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న బాధితులు 24గంటల వ్యవధిలో పోలీసులకు ఫిర్యాధు చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. 24గంటల వ్యవధిలోపు కేంద్ర హోంమంత్రిత్వశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ట్రోఫీనెంబర్ 155260 లేదా డయల్ 100 ఫిర్యాదు చేసినట్లయితే నేరగాళ్ళ ఖాతాల్లో చేరిన డబ్బులను వారి అకౌంట్లనుండి డ్రా చేసుకోకుండా నిలుపుదల చేసి తిరిగి బాధితుల అకౌంట్లలో చేరేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

సైబర్ నేరాలు ఇలా ఉంటాయని చెప్పడానికి ఆస్కారం లేకుండా ఉంది

ఈ మధ్యకాలంలో సైబర్ నేరగాళ్ళు ప్రజలు గుడ్డిగానమ్మేలా వివిధ రూపాల్లో సందర్భాలనుబట్టి వలపన్ని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, షాప్‌క్లూస్ పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల సంఖ్య పెరుగుతున్నదని, వివిధ రూపాల్లో వస్తున్న ప్రకటనలు, లింక్‌లను తెరిచినట్లయితే మోసపోవడం తప్పదని, అన్నివర్గాల ప్రజలు ఇలాంటి తరహా మోసాల పట్ల అప్రమత్తంగా లేనట్లైతే మోసపోకతప్పదని హెచ్చరించారు. వివిధ రకాల వస్తువుల క్రయ,విక్రయాలు, లాటరీలు, తక్కువవడ్డీకి రుణాలు, వీసాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, వివిధ రకాల ఆన్‌లైన్‌గేమ్‌ల ద్వారా ఎటియం, క్రెడిట్‌కార్డులు, ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా మోసకారులు అమాయక ప్రజల అవసరాలు, ఆకర్షణీయమైన ప్రకటనతో ప్రలోభపెట్టి లక్షలాదిరూపాయల్లో మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తక్కువవ్యవధిలో రెట్టింపురాబడులు, ఎలాంటి విద్యార్హతలు లేకపోయినా ఉద్యోగఅవకాశం కల్పిస్తామనడం, ఇతరదేశాలకు వెళ్ళేందుకు తక్కువ ఖర్చులతో వీసాలను అందజేస్తామని, వివిధ రకాల వాహనాలు, వస్తువులను అతితక్కువ ధరలకు విక్రయిస్తామనడం, మిలటరీకి చెందిన ఉద్యోగుల పేర్లను వాడుకుంటూ నకిలీ ఫోటోలు పెట్టి ఆకర్షిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు ఇలా ఉంటాయి అని చెప్పడానికి హద్దులేకుండా పోయిందని, అప్రమత్తతద్వారానే ఇలాంటి తరహా నేరాలు/మోసాలను నియంత్రించవచ్చుని పేర్కొన్నారు.

బ్యాంక్, డిజిటల్ ప్లాట్‌ఫాం సంస్థల సహకారంతో...

సైబర్ నేరగాళ్ళ ఉచ్చులోపడి ఆర్థిక మోసాలకు గురైన బాధితులు వెంటనే ఫిర్యాదు చేసినట్లయితే పోలీసులు డిజిటల్ ప్లాట్‌ఫాం ఖాతాల సంస్థలకు సమాచారం అందించి, పొగొట్టుకున్న సదరు డబ్బు నేరగాళ్ళ అకౌంట్లలో జమఅయినా, వారు తీసుకోకుండా ఉండే విధంగా నిలుపుదల చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఫిర్యాదు చేసే సందర్భంలో లావాదేవీలు జరిగిన పూర్తి వివరాలను తెలుపాలని సూచించారు. వివిధ రకాల రూపాల్లో జరుగుతున్న సైబర్ మోసాల గురించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కమిషనరేట్‌కేంద్రంలో సైబర్‌ఫోరెన్సిక్‌ల్యాబ్ సేవలుకూడా అందుబాటులో ఉన్నాయని, ఇందుకోసం రేయింబవళ్ళు సదరు విభాగం సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకవచ్చిన ఈ సౌకర్యాలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఎలాంటి ఆకర్షణీయమైన ప్రకటనలకు ఆకర్షితులై మోసపోవద్దని చెప్పారు.

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం.. 13 మంది దుర్మరణం

ముంబై, ఆగష్టు 20: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడి 13 మంది కూలీలు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బుల్ధానా జిల్లా సింధ్‌ఖేడ్‌రాజా-మెహకర్ రహదారిపై దూసర్‌బిడ్ గ్రామ సమీపంలో ఇవాళ మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. నాగ్‌పూర్-ముంబై సమృద్ధి ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు పనులకు ఐరన్ తరలిస్తున్న లారీలో కూలీలు ప్రయాణిస్తుండగా ఘటన చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో లారీలో 16 మంది ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేగంగా వెళ్తున్న లారీ రహదారిపై ఏర్పడి భారీ గుంతలోకి దూసుకెళ్లడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు బుల్ధానా ఎస్పీ అరవింద్ చౌరియా తెలిపారు. సమాచారం అందుకున్న కింగాన్ రాజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని జల్నా జిల్లా సింధ్‌ఖేడ్‌రాజా దవాఖానకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. మృతులు ,క్షతగాత్రులంతా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలని ఆయన పేర్కొన్నారు.

ఇతరుల ఆనందంలోనే మన సంతోషం : దలైలామా

హైదరాబాద్ , ఆగష్టు 20:మానవుడు సంఘజీవి. సంఘంలో ఒకడిగా, సంఘంతో పాటుగా జీవించేవాని జీవితమే సార్థకం అంటారు పెద్దలు. ఇదే అంశంపై ఆధ్యాత్మక బౌద్ధ మత గురువు దలైలామా ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఇతరులకు సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందన్నారు. మనం ఎంత శక్తిమంతులుగా కనిపించినప్పటికీ, మనం జీవనం సంఘంపై ఆధారపడి ఉందన్నారు. వ్యక్తిగత సంతోషానికి సంఘం చాలా ముఖ్యమన్నారు. కాబట్టి మనం ఇతరులను సంతోషపరిస్తే, దాని నుండి మనం కూడా ప్రయోజనం పొందుతామని ఆయన పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వేములవాడ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వేకువజామునుంచే పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తమ పిల్లలకు ఎంతో భక్తిశ్రద్ధలతో తలనీలాలను సమర్పించారు. రాజన్నకు ప్రీతిమొక్కైన కోడెమొక్కు తీర్చుకున్నారు. ధర్మ దర్శనం శీఘ్రధర్మనం, ప్రత్యేక దర్శనం కోసం క్యూలైన్ల మీదుగా ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు భక్తులు గర్భగుడిలో నిర్వహించుకునే అభిషేక పూజలు, అన్న పూజలు, ఆకుల పూజలను రద్దు చేశారు. దీంతో 200 రూపాయల అభిషేకం టిక్కెట్లు తీసుకున్న భక్తులకు సోమేశ్వరాలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నను సుమారు రూ.18 లక్షల ఆదాయం సమకూరిందని, దాదాపు 30 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

అలాగే రాజన్న ఆలయ అనుబంధ దేవాలయాలైన భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ, నగరేశ్వరాలయాలలో భక్తుల సందడి కనిపించింది. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆలయ ఈవో దూస రాజేశ్వర్, ఏఈవో ఉమారాణి, హరికిషన్, దేవేందర్, ఆలయ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రూ. 9.35 కోట్ల విలువైన హోమ్ లోన్ కేస్‌ను పూర్తి చేసిన పైసాబజార్.కామ్

హైదరాబాద్ , ఆగష్టు 20:డిజిటల్ కన్జూమర్ క్రెడిట్ మార్కెట్‌ప్లేస్, తమ అతి పెద్దదైన రూ. 9.35 కోట్ల విలువైన హోమ్ లోన్ కేస్‌ను పూర్తి చేసినట్లు వెల్లడించింది. పైసాబజార్ ప్లాట్‌ఫామ్ ద్వారా మూలం అయిన హోమ్ లోన్‌ను, హైదరాబాద్ వాసికి ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ జారీ చేసింది."బహుళ ఆఫర్లను పోల్చుకుని, ఉత్తమమైన దాన్ని ఎంచుకునే సౌలభ్యాన్ని పైసాబజార్ నాకు కల్పించింది. పెద్ద మొత్తం అయినా సరే, నాకు ఎంతో గొప్పగా, ఇబ్బందులు లేని అనుభూతి దక్కింది" అని హైదరాబాద్‌లో ఆంట్ర ప్రెన్యూర్‌గా ఉంటున్న, అధిక మొత్తంలో హోమ్ లోన్ తీసుకున్న కస్టమర్ నితిన్ అగర్వాల్ వెల్లడించారు. గత కొన్నేళ్లుగా, డిజిటల్ మీడియమ్స్ ఉపయోగిస్తూ సరైన హోమ్ లోన్ ఆఫర్‌ను వెతకడంలో, అన్ని కన్జూమర్ విభాగాలలో మాతో అనుబంధం పెరుగుతోందని, పైసాబజార్ వెల్లడించింది. పైసాబజార్ ప్లాట్‌ఫామ్‌కు, రూ. 50 లక్షల మొత్తానికి మించిన ఎంక్వైరీలను నెలకు ది10,000లకు పైగా అందుతుండగా, గతంలో కూడా పలు పెద్ద మొత్తాల హోమ్ లోన్‌లను పూర్తి చేసింది. "కన్జూమర్ ప్రవర్తనలో పరిణతి మరియు మార్కెట్ లీడర్‌గా మేము పెంచుకున్న విశ్వాసాలను రెండింటిని అధిక మొత్తాల రుణ మంజూరులు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. కన్జూమర్‌లకు ఇంటిని కొనుగోలు చేయడం అనేది, వారి జీవితంలో అత్యంత కీలకమైన జీవిత లక్ష్యాలలో ఒకటి, దీనిని అందుకోవడంలో సహకరించడం మాకు ఎంతో సంతోషకరం" అని పైసాబజార్.కామ్ సీఈఓ, కో-ఫౌండర్ అయిన నవీన్ కుక్రేజా వెల్లడించారు. రుణ ఆర్థిక వ్యవస్థ వ్యాప్తంగా హోమ్ లోన్‌లను అందించేందుకు, భారతదేశంలో అతి పెద్ద బ్యాంకు లు, ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్‌ఎఫ్‌సీలతో సహా, పైసాబజార్.కామ్‌కు 20+ యాక్టివ్ భాగస్వామ్యాలు ఉన్నాయి. "వినియోగదారులకు రుణాల ద్వారా అయ్యే మొత్తం ఖర్చులో భారీ అంతరాన్ని తెచ్చే అవకాశం దడంతో, సరైన హోమ్ లోన్ ఆఫర్‌ను పోల్చుకుని, ఎంచుకోవడం ఎంతో కీలకమైన విషయం. పైసాబజార్ వద్ద, అనుభవజ్ఞుల సలహా, సహకారాల పాటు చక్కని భాగస్వామ్యాల ద్వారా సౌకర్యవంతమైన మరియు పారదర్శకమైన ప్రక్రియల ద్వారా, వినియోగదారులకు ఎక్కువ ఎంపికలను అందించడం మా లక్ష్యం," అని రతన్ చౌదరి, బిజినెస్ హెడ్-హోమ్ లోన్స్, పైసాబజార్.కామ్, వెల్లడించారు.

ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డును అందుకున్న సిద్ధీక్ అహ్మద్

హైదరాబాద్, ఆగష్టు 2021 : రియాద్‌లో ని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రత్యేక వేడుకలో ఇరామ్ గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిద్ధీక్ అహ్మద్ కు అధికారికంగా 2021 ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డును (పీబీఎస్ఏ)ను సౌదీ అరేబియాలో భారత రాయబారి హిజ్ ఎక్స్‌లెన్సీ డాక్టర్ ఔసఫ్ సయీద్ అందజేశారు. ఈ సంవత్సరం మిడిల్‌ఈస్ట్ నుంచి ఈ అవార్డు అందుకున్న నలుగురులో డాక్టర్ అహ్మద్ ఒకరు కాగా సౌదీకి ప్రాతినిధ్యం వహించిన ఒకే ఒక్క వ్యక్తి ఆయన. భారతదేశంలో ఇరామ్ గ్రూప్ విస్తృత స్థాయిలో తమ కార్యకలాపాలను నిర్వహిస్తుంది . దేశంలోని ఐదు రాష్ట్రాలలో 2వేల మందికి పైగా ఉద్యోగులను సంస్థ కలిగి ఉంది. ప్రధానంగా శానిటైజేషన్ రంగంలో స్థానిక అవసరాలకు తగినట్లుగా దేశీయ సాంకేతికతలను కంపెనీ అభివృద్ధి చేస్తుండటంతో పాటుగా ఆర్ అండ్ డీ ఆధారిత సామాజిక సంస్థ ఇరామ్ సైంటిఫిక్ సొల్యూషన్స్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. 2011 లో ఈ సంస్థను డాక్టర్ అహ్మద్ సొంతం చేసుకున్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌కు అనుగుణంగా ఆటోమేటెడ్ పబ్లిక్ శానిటేషన్ పరిష్కారంగా వినూత్నమైన ఈ? టాయ్‌లెట్‌ను ఆవిష్కరించింది. దీనిని యుఎన్ ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్ వద్ద ప్రదర్శించారు. ప్రస్తుత శానిటైజేషన్ తీరును సమూలంగా మార్చగల సామర్థ్యం దీనికి ఉన్నట్లుగా యుఎన్ ప్రతినిధులు దీనిని గుర్తించారు. ఈ పేటెంటెడ్ టాయ్‌లెట్‌కు ఇప్పటి వరకూ 12 మిలియన్‌ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇరామ్ సైంటిఫిక్ సొల్యూషన్స్ ఇప్పటికే 44 జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకుంది. డాక్టర్ అహ్మద్ గతంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా టాయ్‌లెట్ టైటాన్ అవార్డును 2015లో అందుకున్నారు.

మానవజాతి ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక క్లిష్ట సవాళ్లకు తగిన పరిష్కారాలను అందించేందుకు కట్టుబడిన డాక్టర్ అహ్మద్‌ను ప్రశంసించిన డాక్టర్ సయీద్ మాట్లాడుతూ కంపెనీ యొక్క వినూత్నమైన ఉత్పత్తులు, సేవలు ఎన్నో స్మార్ట్ సిటీస్‌ను సురక్షితంగా, స్వచ్ఛంగా, స్మార్టర్‌గా మారుస్తున్నాయని, ఈ అవార్డు అందుకోవడానికి అన్ని అర్హతలూ ఆయనకున్నాయన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజీవ్‌గాంధీ

-రాజీవ్ గాంధీ గొప్ప మహోన్నతమైన వ్యక్తి

-తిప్పాపురం లో ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20:(నేటినిజం ప్రతినిధి): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేములవాడ విలీన గ్రామమైన తిప్పాపురం రాజీవ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 76వ జయంతి వేడుకలు ఈ రోజు వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు ఈ దేశానికి చేశారని గుర్తు చేశారు. కంప్యూటర్ వ్యవస్థ తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కును కల్పించింది రాజీవ్ గాంధీ అని ఆయన అన్నారు. నేరుగా కేంద్రం నుండి గ్రామ పంచాయతీలకు నిధులను ఇచ్చింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు ఇలా చెప్పుకుంటూ పోతే రాజీవ్ గాంధీ లేని సేవలు అందించారని ఆయన సేవలను మరచిపో నీవని ఆయన అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ అతి చిన్న వయసులో భారత ప్రధాని పదవి చేపట్టిన మహనీయులు రాజీవ్ గాంధీ అని ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవలు దేశ అభివృద్ధి ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని అన్నారు. రాజీవ్ గాంధీ చివరి శ్వాస వరకు దేశం కోసం పని చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో , జిల్లా అధికార ప్రతినిధి నాగుల విష్ణు ప్రసాద్,జిల్లా అధికార ప్రతినిధి చిలక రమేష్ జిల్లా కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,చిలివేరి శ్రీనివాస్ గౌడ్, కూర దేవయ్య, మోడిగే చంద్రశేఖర్, పాత సత్య లక్ష్మి,పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు తోట లహరి, బొజ్జ భారతి, ఎర్రం ఆగయ్య, వస్తాది కృష్ణ, తంగెళ్ల గణేష్, దాడి మల్లేశం, గేనీటల ప్రకాష్, రా గిరి నాగరాజు, పల్లపు రాజేందర్, తిరుపతి, ఎస్ కె సాబీర్, దేవేంద్ర, మర్రి పెల్లి రాజు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు

సీజేఐ ఎన్.వి రమణకు కాంగ్రెస్ నేత వీహెచ్ లేఖ

హైదరాబాద్ , ఆగష్టు 20:సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణకు సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు లేఖ రాశారు. హజీపూర్ లో ముగ్గురు అమ్మాయిలపై అత్యాచారం చేసి, హత్య చేసిన శ్రీనివాస్ రెడ్డి కేసు ఏడాదిన్నరగా హైకోర్టులో పెండింగ్ లో వున్న విషయాన్ని సీజేఐ దృష్టికి తెచ్చారు.

రెండేళ్ల క్రితం హజీపూర్ హత్యల ఘటన రెండు రాష్ట్రాల్లో కలకలం రేపిన సంగతి తెలిసిందే. వీటి లింకులు కర్నూలు వరకు వెళ్లాయి. ఒంటరి అమ్మాయిలు, మహిళలను టార్గెట్ చేసి, వారిని బైక్ పై ఎక్కించుకుని నిర్మానుష్యమైన ప్రదేశానికి తీసుకెళ్లి, అత్యాచారం చేసి ఆ తర్వాత హత్య చేసిన కేసుల్లో శ్రీనివాస్ రెడ్డిని కింది కోర్టు దోషిగా తేల్చి, ఉరిశిక్ష విధించింది. అయితే, హైకోర్టులో ఈ కేసు ఏడాదిన్నరగా పెండింగ్ లో ఉంది. కేసు పెండింగ్ లో ఉన్న విషయాన్ని సీజేఐ దృష్టికి వీహెచ్ తీసుకెళ్లారు. శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లోయర్ కోర్ట్ తీర్పు ఇచ్చినా హైకోర్టులో ఏడాదిన్నరగా కేసు పెండింగ్‌లో ఉందని వీహెచ్ లేఖలో పేర్కొన్నారు.

విజయనగరంలో యువతిపై పెట్రోల్ దాడి.. సీఎం జగన్ సీరియస్

విజయనగరం, ఆగష్టు 20: విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చౌడవాడ గ్రామంలో యువతి రాములమ్మపై ప్రియుడు పెట్రోలుపోసి నిప్పుపెట్టిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు సీఎంకు తెలియజేశారు. గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో ఈ ఘటన జరిగిందని, బాధితులు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయగానే వెంటనే పోలీసులు స్పందించి ఆమెను సమీప ఆస్పత్రిలో చేర్చారని తెలిపారు. ఈక్రమంలో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాములమ్మను విశాఖపట్నం తరలించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలబడాలని, అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించాలని మంత్రి బొత్స సత్యనారాయణను సీఎం ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ జగన్ ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రి బొత్స సహా డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, అధికారులు బాధితురాలిని పరామర్శించారు.

ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో 13 మంది విద్యార్థులకు కరోనా

చెన్నై, ఆగష్టు 20:: తమిళనాడులోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో 13 మంది విద్యార్థులకు కరోనా సోకింది. సేలం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఇది వెలుగు చూసింది. కాలేజ్‌ను తెరిచిన కొన్ని రోజుల్లోనే పదుల సంఖ్యలో విద్యార్థులు కరోనా బారిన పడ్డారు. తమిళనాడులోని అన్ని వైద్య, నర్సింగ్ కళాశాలలను సోమవారం నుంచి తెరువాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సేలంలోని ప్రభుత్వ మోహన్ కుమారమంగళం మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న మూడవ ఏడాది నర్సింగ్ విద్యార్థికి క్లాసులు తిరిగి ప్రారంభమైన ఒక రోజు తర్వాత జ్వరం వచ్చింది. ఆమెకు కరోనా పరీక్ష చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

ఈ నేపథ్యంలో తరగతిలోని మిగతా 19 మంది విద్యార్థులకు కరోనా టెస్ట్ చేయగా పది మందికి వైరస్ సోకినట్లు తేలింది. మరో ఇద్దరు తొలి ఏడాది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో కరోనా సోకిన నర్సింగ్ విద్యార్థులను సేలం ప్రభుత్వ ఆసుపత్రిలోని కరోనా వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ నర్సింగ్ కాలేజ్‌లో చదువుతున్న 176 మంది విద్యార్థులకు గత రెండు రోజులుగా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు

నేటినుంచి హోటల్ ఆదిత్యపార్క్‌లో కేరళ ఫుడ్ ఫెస్టివల్

హైదరాబాద్ , ఆగష్టు 20:అమీర్‌పేట్ హోటల్ ఆదిత్య పార్క్?లోని ప్రామినేడ్ రెస్టారెంట్‌లో శనివారం నుంచి కేరళ ఫుడ్ ఫెస్టివల్ 'ఓనమ్ సద్య' జరుగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను హోటల్ మేనేజర్ రాజు వెల్లడించారు. ఎంపిక చేసిన మళయాళీ రుచుల మేళవింపుతో రూపొందించిన వంటకాలను ఇక్కడ భోజన ప్రియులకు వండి వడ్డించనున్నారు.సంప్రదాయ కేరళ రుచులైన వాజై అప్పం, సర్కార వరాట్, పుటి ఇంజి, కడు మంగ, నిరంగ అచార్, మధుర కర్రి, వెల్లారి పచ్చడి, పజమ్ నురుక్కు, కేరళ పాపడ్, బనానా, పయారు థోరన్, అవియల్ కాలన్, ఓలన్, కూటు కర్రి, కైథా చక్కా పుసిళ్ళెరి, నీ పరుప్పు, సాంబార్, రసమ, సంబరమ్, అడ్ ప్రధమన్, చెరుపాయర్ ప్రధమన్ వంటి వెజిటేరియన్ రుచులను సంప్రదాయ పద్ధతిలో అరటి ఆకుపై వడ్డించనున్నారు.

విశ్వకవితా తత్వం



మహకవి గుర్రం జాషువా 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని పద్య కవిత్వాన్ని మలుపు తిప్పిన మహకవి,జాషువా సాహిత్యాన్ని ఎప్పుడు చదివినా ఏమి అర్థమవుతుందంటే జాషువా పడిన ఆవేదన అతని కన్నీటి రాతల గురించి అ రాతల లోతుల గురించి అతను పడిన కష్టాల గురించి అర్థమవుతుంది.

Fear River the అనే ఒక ఫ్రెంచ్ రచఈత "అనుభవమనే విద్యుత్ ప్రవాహం తన ద్వార వెల్లటం వల్ల తీవ్రీకరించి కాంతిని ఇచ్చే ఫిలమెంట్ కవిత్వం" అన్నాడు.అంటే అనుభవాలు కవిత్వ వ్యక్తీకరణకి పునాది రాఇగా తల్లి వేరుగా ఉపయోగపడతాఇ.అనుభవాల్లోంచి వచ్చిన కవిత్వానికి అద్భుతమైన ప్రమాణికత ఉంటుందని తెలుస్తుంది.

జాషువా కవిత్వాన్ని తెలుసుకునేటప్పుడు అతని నేపద్యాన్ని,అతడు జీవించిన సామాజిక,ఆర్థిక,నేపద్యంలోంచి ఆయన కవిత్వాన్ని విశ్లేంచాల్సి ఉంటుంది.చాలా మంది లబ్ద ప్రతిష్టులైన,ఉద్దండ పండితులు తమ గురువుల పేర్లు తమ గురువుల గురించి చాలా గొప్పగా చెప్పుకున్నారు.కాని జాషువా నాగురువులు ఇద్దరు అని ఒకటి పేదరికం,రెండవది కులమత భేదం అని చెప్పాడు అంటే పేదరికాన్ని గురువుగా భావించడం గొప్ప విషయం,అందుకే అతని కవిత్వం ఇప్పటికి ప్రజల నాలుకల మీద సజీవంగా జీవిస్తుంది.జాషువా గాంధీజం దాటి బయటకు రాలేదని కొంత మంది విమర్శకులు విమర్శించారు.కాని అతని సాహిత్యాన్ని అభ్యసించిన తర్వాత అర్థమైనది ఏమిటంటే ఒక విశాలమైన సామాజిక విముక్తిని అతని కవిత్వం ద్వార ఎలుగెత్తి చెప్పాడని తెలుస్తుంది.జాషువా చివరి దశలో అంబేద్కర్ లక్ష్యాల వైపు అతని ఆశయాల వైపు చూశాడు.అందుకోసం కవిత్వాన్ని ఒక ఆయుధంగా వాడుకున్నాడని జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేశాక అర్థమవుతుంది.ముఖ్యంగా జాషువాని రెండు విధాలుగా విశ్లేషించాలి.ఒకటి జాతీయోద్యమంలో ఒక వలసవాద కవిగా బ్రిటిషు వాళ్ళు భారతదేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు,భారతదేశం యొక్క సాంస్కృతిక,చారిత్రక,ఔనత్యాన్ని గొప్పతనాన్ని కొనియాడాల్సిన అవసరం ఉంది.అందరి జాతీయోద్యమ కవుల మాదిరిగానే జాషువా కూడా తన కవిత్వం ద్వార భారతదేశం యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పాడు.

సకల మంద్దాత సట్ చక్రవర్తుల అంక చీమల నిల్పినట్టి సాద్వి
కమల నాధుని వేణుగాన సుధాంబుది మునిగి తేలిన పరిపూత దేహ
బుద్ధాది ముని జనంబుల తపంబున మోద బాష్పముల్ విడిచిన భక్తురాలు
భరత మాతృక సంతాన గరిమ తలొంచుకొన మేను పులకరించున్నది.

కవిగా ఒక భారతీయుడిగా అదే జాషువా అదే భారతదేశాన్ని తన అస్థిత్వ కోణం నుంచి భిన్నంగా విమర్శించాడు

ఉచ్చత నీచత యుత వితర్క భ్రష్ట దేశం
కుల భేద శాఖినుల్ వెదలిడి దేశం
మానవ దాస్యం మరిగిన లోకం

అన్నాడు జాషువా ఒక భారతీయుడిగా భారతదేశాన్ని పొగిడాడు అదే జాషువా తన అస్థిత్వ కోణం నుంచి విమర్శించాడు.ఇది చాలా కీలకమైన విషయం,ఇది తన కవిత్వంలో చాలా స్పష్టంగా కన్పిస్తుంది.

ఎంత దాస్యమేను సహింతును గాని
సహించను సొంత సహోదరుల పర బల
బందువుల దాస్యంను
తెల దొంగలు తిరుగందు వేల
నల దొంగలు నల్ల మార్కెట్‌లో
తిన కుండా చూసుకోండి అన్నాడు

ఎంత సేపటికి తెల్లవాళ్లు దోచుకున్నారు,తెల్లవాళ్లు మన సొమ్ము తిన్నారు అని మాట్టాడుకుంటున్నారు కాని నల్ల దొంగలు దోచుకుంటున్నారని ఎవరు ఆలోచించటం లేదు,అని జాషువా ప్రశ్నించాడు అలాగే

మహత్ముని చెప్పుల జాడలో కాలాడ చరింతును
లోక మోహన సబర్మతి సన్ముని కిన్ కుమారుడను

అని స్పష్టంగా గాంధి,అంబేద్కర్,క్రీస్తు,బుద్దుడు,నడిచిన వజ్రమార్గంలో నేనోక అజ్ఞాతప్రవాసిని,ఆమహత్ముల ప్రేమ శంఖ ధ్వని నాకవిత్వంలో వినబడుతుంది అని చెప్పుకోవడం గర్వకారణం అని జాషువా స్పష్టంగా చెప్పాడు.నేను గాంధీ శిశువ్యని అని చెప్పుకోవడం నాకు గర్వకారణం అని చెప్పుకున్నాడు అదే జాషువా అంబేద్కర్ మరణం చాలా పద్యాలు రాశాడు అందులో ఒకటి

శాంతి సంగ్రామోద్దండులలో పోరు సల్పి
జయ శంఖంబెత్తి యావత్తు జగంబు
ఆమోదింపగా మేలు కొల్పినావు ఆత్మీయ జాతీయులన్

అని జాషువా అంబేద్కర్‌ను ఉద్దేశించి పద్యం రాశాడు.అంటే నువ్వు గాంధీతో యుద్ధం చేసి దానిని యావత్తు జనులు ఆమోదించారు.అంబేద్కర్ దృక్పథం ఇవాల దళిత విముక్తికి అవసరం అని జాషువా అభిప్రాయపడ్డాడు.

జ్ఞానమత సాంఘీక స్వేచ్ఛ నలుగురకును ఏకరీతి లభించునందాక
రాదు భావి భారత కళ్యాణ సుఖము సల్లారదు ఎప్పుడు
సంగ్రామ సుఖము అని చెప్పాడు

జాషువా తన కవిత్వం ద్వార సాంఘీక స్వేచ్ఛ ఉండాలి,సాంఘీక సమానత్వం లేకపోతే,ఆర్థిక సమానత్వం లేకపోతే,భారతదేశం సామాజిక విముక్తి జరగదు అని స్పష్టంగా శాస్త్రీయంగా అంబేద్కర్ లాగానే ఆలోచించాడు.అంబేద్కర్ జాతీయోద్యమాన్ని అనుమానించాడు.స్వతంత్ర్యం అనే మంత్రదండం దళితులకు ఏమైన మేలు చేయగల్గుతుందా ఈదోపిడి వర్గాన్ని అంతం చేయగలదా అలాంటి స్వంత్ర్యమే నాకు కావాలి అని చెప్పాడు.జాషువా కూడా జాతీయోద్యమ కార్యచరణని చాలా జాగ్రత్తగా అనుమానించాడు అంబేద్కర్ లాగానే.

స్వాతంత్ర్యంబులు స్వర్గ సౌధమున మా భాగంబు మాకిత్తురో
ఖాతా లేదని త్రోచిపుచ్చెదరో అని స్పష్టంగా జాషువా అంబేద్కర్ లాగానే జాతీయోద్యమాన్ని కాంగ్రెస్ రాజకీయాలను అనుమానించాడు ఇవాల అస్థిత్వ ఉద్యమాలు చెప్పేటటువంటి రాజ్యాధికార భావన అనేది జాషువా 1946 లోనే చాలా స్పష్టంగా గబ్బిలంలో చెప్పాడు.

వెరపు వలదు నీకు హరిజన సోదరా
స్వియ రాజ్య రథము వెడలివచ్చె
లాగి కొమ్మునకు భాగంబు కలదంచు
పాడుచుండి రత్న భరతమాత

అని జాషువా ఒక పిలుపునిచ్చాడు అంబేద్కర్ రాజ్యాధికారం ద్వారానే దళితుల విముక్తి సాధ్యమవుతుందని ఎలా చెప్పాడో,జాషువా కూడా 1946లోనే గబ్బిలంలో చెప్పాడు.స్వాతంత్ర్యం రాబోతుంది ఆస్వాతంత్ర్యంలో నీకు భాగముంది రాజ్యాధికారంపై నీకు హక్కుంది దాన్ని నిర్భయంగా లాక్కోవాలని జాషువా గబ్బిలంలో భరతమాతే చెప్తుంది అన్నట్లుగా వ్యక్తీకరించాడు.గాంధీ హరిజనోద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ఇస్తున్నటువంటి ప్రణాళికలను కూడా జాషువా అనుమానించాడు.

హరిజనులనుద్ధరించు ప్రయత్నంములందు
వెనుకాముందు లాడుచున్నవి పెద్దతలలు కొన్ని

అని కాంగ్రెస్ పార్టీలోని బ్రాహ్మణ వాదాన్ని జాషువా చురకలంటించాడు. అలాగే శాసనములు చేయగలము గానీ నిలుపచేయలేము అని అంటాడు.ప్రభుత్వం జిఒలు తీస్తుంది కాని జిఒ లలోని సారం నిజజీవితంలో అమలవడం లేదు అని ప్రభుత్వ వైఫల్యాన్ని జాషువా తన కవిత్వంలో ప్రశ్నించాడు.జాషువా దళిత కవి అని చాలా మంది సాహిత్య విమర్శకులు విమర్శించారు.కాని నాదృష్టిలో జాషువా జాతీయ కవి ఆయన కేవలం దళిత సాహిత్యానికి తల్లి వేరు లాగా మాత్రమే ఉన్నాడు ఇతనిని దళిత కవి అని ఒక ముద్ర వేయనవసరం లేదు అతను జాతీయ కవిగా గౌరవించాల్సిన అవసరం ఉంది.

కులమతాలు గీచుకున్న గీతలు చోచ్చు
పంజరాన కట్టు వడ నేను
నిఖిల లోక మెట్లు నిర్జఇంచిన గానీ
తరుగు లేదు విశ్వ నరుడ నేను

అని విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని విశ్వశాంతిని జాషువా కోరుకున్నాడు దళిత విముక్తికి సామాజిక విముక్తికి సంబధం ఉందని చెప్పాడు స్త్రీల విముక్తిని ఆశించాడు హిందు ముస్లీంల మైత్రిని "మీరాబాఇ"రచనల ద్వార చాటి చెప్పాడు."తెరచాటు"నవలలో స్త్రీల యొక్క మహిళా సాదికారతని అద్భుతంగా స్పష్టంగా చెప్పాడు నదులు జాతీయం కావాలని చెప్పాడు.జాషువా ఒక దళిత సమస్య దగ్గర ఆగిపోకుండా మనిషిని పీడించే అనేక రకాల ఆర్థిక,సామాజిక,రాజకీయ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తన కవిత్వంలో ప్రజలకు అర్థమయ్యే భాషలో సదళంగా వాడుక భాషలో రచనలు చేశాడు.

జాషువా మాల మాదిగల మద్య ఉన్న అంతరాలని చాలా నిర్మోహమాటంగా విమర్శించాడు అదే జాషువా గొప్పతనం చాలా మంది బ్రాహ్మణ కవులు బ్రాహ్మణులలో ఉన్నటువంటి భేదాలను గురించి రాయలేకపోయారు.చాలా మంది వాళ్ళ వాళ్ళ జాతుల్లో వాళ్ళ వాళ్ళ కులాల్లో ఉండే లోపాల్ని ముసుగు వేసి దాచిపెట్టారు కాని జాషువా అలా దాచిపెట్టలేదు.తన జాతి జనుల మద్య ఉన్న అసమానతలని ధైర్యంగా ఎత్తి చూపాడు.

పంచమీయులలోన మాలవాడతండు
పంచములలోన మాదిగ వాడ నేను
ఉభయులము క్రైస్తవ మత ఒదిగినాము
సోదరత గిట్టు బాటు కాలేదు మాకు

అంటూ విమర్శించాడు ప్రాచీన కవి పండితులంత సంస్కృత భాష యొక్క గొప్పతనాన్ని కీర్తించారు.దళిత కవులంత అచ్చ తెలుగు పదాలు,పల్లెల్లో మాట్లడుకునేటప్పుడు,మాల మాదిగ వాడల్లో వ్యవసాయ పనులు చేసుకునేటప్పుడు మాట్లడుకునే ఆ మాటలను,ఆ పదాలను తమ కవిత్వంలో అనువదించుకొని దళిత కవులు అద్భుతమైన తెలుగు పదాలను ప్రయోగించారు.మొత్తం తెలుగు సాహిత్యంలోనే తెలుగు భాష ఔనత్యాన్ని తెలుగు మూల పదాలని దళిత కవులు వాడారు.జాషువా తన కవిత్వంలో వీలైనంత తక్కువ సంస్కృత పదాలని వాడాడు వాడుక భాషా పదాలని వాడాడు.

నేను డప్పుకొట్టి
నేను చిందులాడి
అలని సొలసి
ఫలిత మెల్ల కొలుపు
నొరులు భావించుకొని పొవ

అంటాడు జాషువా తెలుగు పద్యానికి భిన్నంగా పద్య నడకను నడిపించాడు జాషువా,తెలుగు పద్యానికి ఒక గుర్రం లాగా పరుగెత్తించాడు.తెలుగు పద్యాన్ని వయ్యారంగా రమణీయంగా నడిపించాడు జాషువా,అన్ని కోణాలలో తన సాహిత్యాన్ని ఉపయోగించి సామాజిక మార్పు తీసుకురావడానికి ప్రయత్నించాడు కాబట్టి జాషువా ఒక రవీంద్రనాథ్ ఠాగూర్ లాగా జాతీయ కవి

-పులిగిల్ల ఉపేందర్
ఓ.యు
సెల్:9573784198

పట్టుబడిన నకిలీ నోట్ల ముఠా

హైదరాబాద్ , ఆగష్టు 20:నకిలీ నోట్లను తయారు చేసి వాటిని మార్కెట్లో చలామణి చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేయగా, నిందితుల్లో మాజీ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. గురువారం సిటీ